

నేడు వైఎంహెచ్ఎ హాలులో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర సాహిత్య అకాడమీ, జిల్లా యంత్రాంగం, వైఎంహెచ్ఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ గురువారం తెలుగు సంప్రదాయ రీతిలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు సెట్వెల్ సిఇఒ మెహర్రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో 'సంక్రాంతి సంబరాలు' నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, కవి సమ్మేళనం, కూచిపూడి, జానపద నృత్యాలు, సాహిత్య అవధానం, హరికథ, భువన విజయం, సాహిత్య గోష్ఠి, కవులకు సత్కారం వంటి పలు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొనాలని మెహర్రాజ్ విజ్ఞప్తి చేశారు.

కోఢీ ఆగేనా..!



కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలులో పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రతియేటా విఫలమవుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పుడు మరోసారి కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలయ్యేనా అంటూ చర్చలు సాగుతున్నాయి. కోడి పందేలను అడ్డుకుంటామంటూ కలెక్టర్, ఎస్పి నుంచి కిందిస్థాయి అధికారులు వరకూ ప్రకటనలు గుప్పించడం, పండుగ మూడు రోజులు మౌనముద్ర పాటించడం ప్రతియేటా పరిపాటిగా మారిపోయింది.

- ప్రతియేటా అమలు కాని హైకోర్టు ఉత్తర్వులు
- పండుగ మూడు రోజులు పోలీసు, రెవెన్యూ అధికారుల మౌనముద్ర
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 400కుపైగా బరుల్లో పందేల జోరు
- యథేచ్ఛగా గుండాట, మూడు ముక్కలాట
- ఈసారైనా పందేలకు అడ్డుకట్ట వేయాలని అంతా ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతియేటా 400కుపైగా బరుల్లో కోడి పందేలు సాగుతున్నాయి. దాదాపు రూ.200 కోట్లకుపైగా సొమ్ము చేతులు మారుతోంది. ప్రధాన రహదారులకు పక్కగా టెంట్లు వేసి, ఫ్లడ్లైట్ల వెలుగుల్లో కోడిపందేలు జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంటోంది. కోడి పందేలపై గతంలో కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా పందేలను అడ్డుకోవాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా కోర్టు ఆదేశాలను అమలు చేసిన పరిస్థితి లేదు. కోడి పందేలతోపాటు గుండాట, మూడు ముక్కలాట సైతం యథేచ్ఛగా బరుల వద్ద సాగుతున్నాయి. సామాన్య ప్రజానీకం ఎంతోమంది పందేలకు ఆకర్షితులై జేబులు ఖాళీ చేసుకుని రోడ్డున పడుతున్నారు. ఈ ఏడాది సైతం కోడిపందేలకు పందెంరాయుళ్లు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. ఇప్పటికే బరుల ఏర్పాటుకు స్థలాల ఎంపికతోపాటు, అతిథులకు ఆహ్వానాలు సైతం పంపించేశారు. పందెం కోళ్లకు పెద్దఎత్తున తర్ఫీదు ఇస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పందేలు పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భీమవరం, కాళ్ల, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, ఉండి వంటి మండలాలతోపాటు ఏలూరు జిల్లాలో పెదవేగి, జంగారెడ్డిగూడెం, దెందులూరు, ఉంగుటూరు వంటి అనేక మండలాల్లో పందేలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈసారి 300కుపైగా బరుల్లో పందేలు నిర్వహించనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. దీనికోసం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు సైతం ముట్టజెప్పేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల తరుణంలో ప్రభుత్వం కోడిపందేలను మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా పందెంరాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఏలూరు, భీమవరం వంటి పట్టణాల్లో ఇప్పటికే ముందస్తుగా హోటల్ గదులు సైతం బుక్ చేసినట్లు తెలుస్తోంది. సంప్రదాయం ముసుగులో కొంతమంది పందెంరాయుళ్లు వీటిని ప్రోత్సహిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండ ఉండటంతో ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు సాగుతోంది. పోలీసుల బైండోవర్ కేసులు, బరుల తొలగింపు లెక్కలన్నీ కేవలం రికార్డుకు చూపించడానికే తప్ప కోడి పందేలను నిరోధించడానికి కాదని స్పష్టంగా అర్థమవుతోంది. సంక్రాంతి వస్తుండటంతో మరోసారి కోడిపందేలను అడ్డుకుంటామంటూ అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కన్పిస్తోంది. బరుల నిర్వహించే నిర్వాహకులను పిలిపించుకుని పోలీసులు తమ వాటాలు మాట్లాడుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈసారైనా హైకోర్టు ఆదేశాలను అమలు చేసి కోడిపందేలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

- వివిధ జిల్లాల నుంచి 65 మంది ప్రతినిధులు హాజరు
- తొలిరోజు వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చలు
- రాజకీయ, ప్రజాసమస్యలపై మీడియాతో మాట్లాడిన పొలిట్బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు
- రెండు రోజుల సమావేశాల్లో పలు తీర్మానాలు చేయనున్న రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజరైన నాయకులు

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ హోటల్ కన్వెన్షన్ హాలులో రెండు రోజులపాటు జరగనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 65 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలిరోజు ఉదయం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం అనంతరం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పలు రాజకీయ అంశాలతోపాటు, ప్రజా సమస్యలపై కమిటీలో విస్తృత చర్చలు సాగాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలు, పరిణామాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్యఅతిధులుగా విచ్చేసిన సిపిఎం పొలిట్బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి, బివి.రాఘవులు కేంద్ర, రాష్ట్ర రాజకీయ అంశాలతోపాటు, ప్రజాసమస్యలపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మత విశ్వాసాలతో బిజెపి రాజకీయం చేస్తుందని ఎంఎ.బేబి విమర్శించారు. అయోధ్యలో రాముడి పేరుతో రాజకీయాలు నడుపుతుందన్నారు. మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అయోధ్యలో రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట పేరుతో బిజెపి హడావుడి చేస్తుందన్నారు. ఇటీవల పార్లమెంట్లో చోటుచేసుకున్న భద్రతా లోపాలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా బయటకు గెంటేసిందన్నారు. ప్రతిపక్షాలు లేకుండా కీలకమైన బిల్లులను ఆమోదించుకుందని, ఇది ప్రజాస్వామ్యంలో ఏమాత్రం సరికాదని అన్నారు. మరో పొలిట్బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ మీడియా గొంతు నులిమే చట్టాలను తేవడమే కాకుండా, కఠిన నిబంధనలను తెచ్చిందన్నారు. వాక్ స్వాతంత్రం మాదిరిగానే, మీడియా స్వాతంత్రం ఉండాలన్నారు. న్యూస్క్లిక్, పలు పోర్టల్స్లో పని చేసే జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతుందన్నారు. సిపిఎం దీన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మోడీ తరహాలోనే జగన్ నిరంకుశంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించకపోతే వైసిపి ప్రభుత్వ పతనం ఖాయమన్నారు. ఎస్మా పేరుతో బెదిరింపులు వంటివి మానుకుని చర్చలతో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులకు ఇంకా సమయం ఉందని, అప్పటి పరిస్థితిని బట్టి నిర్ణయం ఉంటుందన్నారు. బిజెపి పొత్తులో ఉన్న పార్టీలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవితోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

పట్టుదల, ఐక్యతతో పోరాటాలే శరణ్యం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జగన్ లాంటి మూర్ఖత్వపు ప్రభుత్వంలో ఐక్యతతో, పట్టుదలతో పోరాటాలే శరణ్యమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ఎంఎ.గఫూర్ అన్నారు. బుధవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె 30వ రోజు, 24 గంటల దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గఫూర్ పాల్గొని ప్రసంగించారు. ఇలాంటి నీరో చక్రవర్తి పరిపాలనలో మరింత ఐక్యతతో కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుతో మరింత పట్టుదలగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. జీతం పెంచకుంటే ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. పనికిమాలిన సలహాదారులకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వానికి దళిత, బడుగు, బలహీన వర్గాలకు సేవలందించే అంగన్వాడీలకు జీతాలు



మాట్లాడుతున్న ఎంఎ.గఫూర్

పెంచడానికి డబ్బులు లేవనడం సిగ్గుచేటన్నారు. తాడోపేడో తేల్చుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని ఆయన ధైర్యం చెప్పారు. అంగన్వాడీల ఉద్యమం రాష్ట్ర చరిత్రలో కార్మిక ఉద్యమాలకు, ప్రజా ఉద్యమాలకు ఎంతో ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. మహిళ కన్నీరు పెట్టుకుంటే ఏ కుటుంబమైనా బాగుపడనట్లే రాష్ట్రం కూడా బాగుపడదని, లక్షలాది మంది మహిళలతో కన్నీరు తెప్పిస్తున్న జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుంటే వారి కన్నీటిలో కొట్టుకుపోతుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కొర్రి విజయలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబు, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, యుటిఎఫ్ జిల్లా నాయకులు పివి.నరసింహారావు, కనకదుర్గ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు పులి శ్రీరాములు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

షోకాజ్ నోటీసులు అతికించొద్దు..

అధికారులను అడ్డుకున్న అంగన్వాడీ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

'షోకాజ్ నోటీసులు పోస్టులో పంపండి.. ఇళ్లకు ఎందుకు అంటించొద్దు' అంటూ రెవెన్యూ ఉద్యోగిని అంగన్వాడీ టీచర్ కుటుంబ సభ్యులు అడ్డుకున్న ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. యర్రగుంటపల్లిలో అంగన్వాడీ టీచర్ ఇంటికి షోకాజ్ నోటీసు అంటించేందుకు ఆ గ్రామ రెవెన్యూ ఉద్యోగి వెళ్లారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. నోటీసులైనా.. ఏమైనా పోస్టులో పంపండిగాని ఇలా ఇళ్లకు అంటించొద్దని విజ్ఞప్తి చేశారు. అయినా ఆ ఉద్యోగి నోటీసు అంటిస్తుండగా కుటుంబ సభ్యులంతా వచ్చి అడ్డుకుని తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగడం ఏమిటని, వారెక్కడికి పారిపోలేదు.. ఇక్కడే ఆందోళన చేస్తున్నారుగా అక్కడకెళ్లి నోటీసు ఇవ్వండి.. లేదా పోస్టులో పంపండిగాని ఇంటికి అంటిస్తే అంగీకరించబోమని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. దీంతో సదరు ఉద్యోగి చేసేదేమీ లేక వెనుదిరిగారు.



నోటీసు అతికించడంపై అభ్యంతరం తెలుపుతున్న అంగన్వాడీ కుటుంబ సభ్యులు

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ప్రభుత్వ హామీతో సమ్మె తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీతాలు పెంచకుండా, సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్మికులు 16వ రోజు బుధవారం తమ సమ్మె కొనసాగించారు. తమ డిమాండ్లు పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు భిక్షాటన నిర్వహించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుండి మెయిన్బజార్ సెంటర్, పెద్ద పోస్టాఫీస్, పేరయ్య కోనేరు, వైఎంహెచ్ఎ హాలు, బిర్లా భవన్ సెంటర్ మీదుగా మున్సిపల్ ఆఫీస్ వరకు ఈ భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు బండి భవాని మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని



ఏలూరులో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, క్లాప్ఆటోల డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి పంతం నాగరాజు, బంగారు వెంకటేశ్వరరావు, టి.జార్జి, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, దుర్గ, పాప, రాజు తదితరులు నాయకత్వం వహించారు.

నూజివీడు రూరల్: మున్సిపల్ కార్మికులు 16వ రోజు పట్టణంలో సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడగా పట్టణాధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్, మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవింద్, రాణి, పద్మ గౌరీ, ఉషారాణి, భారతి, భవాని, పంగిడమ్మ, ఏడుకొండలు, రాజేంద్ర, చంద్రశేఖర్, జయరాం, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ఎఐటియుసి ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. సమ్మె శిబిరాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సందర్శించి మద్దతు ప్రకటించి మాట్లాడారు. 8వ రోజు సమ్మెలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యలగడ శివకుమార్, ఎ.లీలకుమార్, ఎ.కిరణ్, తంగెళ్ల ఉమ, బంగారు చిన్నమ్మ, బి.నారాయణరావు, ఎస్ఎంవి.సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు
- పోలింగ్ శాతం పెంపునకు కృషి
- రాజకీయపక్షాల సమావేశంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా, తటస్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమా వేశంలో చర్చించిన అంశాలను రాజకీ యపక్షాల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, రాజ కీయ పార్టీల ప్రతి నిధులు డి.రత్నబాబు (బిఎస్పి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.బాబూప్రసాద్ (కాంగ్రెస్), ఎం.దశరథకుమార్ (ఆమ్ఆద్మీ), పాలి ప్రసాద్ (టిడిపి), కలవకొల్లు సాంబ (వైసిపి) తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో నూరుశాతం స్వచ్ఛమైన, దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని చర్యలూ తీసుకున్నామని, దీనికి రాజకీయ పక్షాల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల నిర్వహణలో ఎటువంటి సమస్యలూ తలెత్తకూడదనే ప్రధానోద్దేశంతో ప్రతివారం రాజకీయపక్షాల ప్రతినిధులతో నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో పోలింగ్శాతం పెంచే దిశగా ఓటర్లకు అవగాహన కల్పించే సీప్ అవగాహనా కార్యక్రమాలను కూడా ముమ్మరం చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లవారీగా గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని సంబంధిత ఇఆర్ఒ, ఎఇఆర్ఒల ద్వారా పరిశీలించి ఎక్కడ తక్కువగా ఉందో గమనించి ఓటింగ్ శాతం వృద్ధిపరిచే ప్రణాళికను తయారు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం తదితర పంపిణీ వంటి వాటిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. దీనికి సంబంధించి పటిష్టమైన నిఘా చేపడతామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నీచర్, విద్యుత్, ర్యాంప్ ఏర్పాటు, తదితర మౌలిక సదుపాయాలను రానున్న రెండు వారాల్లో పూర్తి చేస్తామని చెప్పారు. పోలింగ్ సమయంలో క్యూలైన్లో ఎక్కువసేపు నిలబడలేని వారి సదుపాయం కోసం కుర్చీలను కూడా ఏర్పాటు చేస్తారన్నారు. ఒకేచోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నచోట ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ శాతం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అర్హులైన యువతను ఓటరుగా నమోదు చేసే ప్రక్రియలో భాగంగా జిల్లాలో 2023 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత 11 వేల ఓటర్లుగా ఉండగా దానిని ప్రస్తుతం 36 వేలకు తీసుకెళ్లామన్నారు. ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే వరకు ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల నామినేషన్ తేదీ వరకు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, వీటిని సప్లిమెంట్ ఓటర్ల జాబితా కింద ప్రకటిస్తామని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఒంటి కాలిపై నిల్చొని నిరసన

కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ఏలూరు అర్బన్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె బుధవారం 22వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి వినూత్న రీతిలో తమ నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, ఝాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థులతో డైరెక్టర్ శ్రీనివాస్


ట్రిపుల్ ఐటి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులను బుధవారం ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9 తేదీల్లో గుంటూరులోని యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పలు విభాగాల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. జానపద బృందగానం విభాగంలో వై.సుప్రియ బృందం ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటలకు ఎంపికైందన్నారు. ఈ నెల 12 నుండి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్లో జరిగే 27వ జాతీయస్థాయి యువజనోత్సవాల్లో ఆయా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

నేడు ఏలూరులో 'సామాజిక సమతా సంకల్పం'

ఏలూరు: విజయవాడలో 125 అడుగుల భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ సందర్భంగా 'సామాజిక సమతా సంకల్పం' ఏలూరు జిల్లా సమావేశం ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో అంబేద్కర్ జీవిత చరిత్ర తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శన, పుస్తక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఫ్లెక్సీ బ్యానర్పై అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ ప్రతిజ్ఞ చేస్తూ సంతకం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

బుట్టాయగూడెం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి కృషి చేస్తుందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ, ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మి ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపిపి కారం శాంతి, ఎంపిడిఒ వేణుగోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, వైసిపి మండల కోకన్వీనర్ సోదే సుధాకర్, బుట్టాయగూడెం ఎంపిటిసి తెల్లం రమణ, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, బుట్టాయగూడెం సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 10 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తమార్పిడి నిర్వహిస్తున్నామన్నారు. 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన కొమ్మన బాలగంగాధర్ తిలక్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాదరావు, సిహెచ్.మౌనిక పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ముసునూరు : నిరుపేద కుటుంబానికి అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత అట్లూరి వెంకట రవీంద్ర బుధవారం ముసునూరు గ్రామంలో రాచూరి భూషణం(లేటు) భార్య సమాధానం కుటుంబానికి అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బట్టలు, బియ్యం, వంట సామాగ్రి, నగదు, కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కె.విజయలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు పొకనాటి అంజనేయులు, లక్ష్మిపాము కాంతారావు, కొండేటి బాబి, గారపాటి నరసింహారావు, నక్కా యోహాను, జాను, వేల్పూరి శివ పాల్గొన్నారు.

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

ముసునూరు : అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అట్లూరి వెంకట రవీంద్ర కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో గత రెండు రోజుల క్రితం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆపరేషన్ అవసరమైన వృద్ధులకు బుధవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. లక్ష్మి పాము కాంతారావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో యూత్ ఫెస్టివల్

భీమడోలు : సమైక్యత, సోదర భావం, సమ భావన పెంపొందించే పండగల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు సహకరిస్తాయని భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రధాన ఆచార్యులు బొమ్ము రవికుమార్, వంగా నాగేశ్వరరావు అన్నారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కరించుకుని యూత్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యత వివరించే రీతిలో ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులకు ముగ్గుల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం బాధ్యులు బి.నాగరాజు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు అర్బన్ : సంక్రాంతి సెలవు దినాల్లో క్లాసులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ వై.నరసింహారావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకినాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినప్పటికీ జిల్లా కేంద్రంలో ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, నగర కమిటీ సభ్యులు వై.యశ్వంత్ పాల్గొన్నారు.

శ్రీ సుగుణ కళాశాలలో ముగ్గుల పోటీలు

కలిదిండి : సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక శ్రీసుగుణ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో రంగవల్లి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో రంగవల్లి ముగ్గులు తీర్చిదిద్దారు. ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆడవాల పద్మజ, దూసనపూడి విజయలక్ష్మి, యక్క షెలినికి సంస్థ అధినేత కారు రాజమణి బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

జీలుగుమిల్లి : పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిటిఆర్ఐలో పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులపై సాంకేతిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రసాద్, సరళ, ఆర్ఎమ్.ఆదిశేషయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

భీమడోలు : వికలాంగుల సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్న గుండుగొలను శ్రీవిశ్వేశ్వర వికలాంగుల సేవాసమితికి దాతల సహకారం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 55 మంది వికలాంగులకు నిత్య బియ్యం, పండ్లు, పౌష్టికాహారాన్ని దాత శంకరం మాస్టారు కుటుంబ సభ్యులు, ఎన్ఆర్ఐలు గంటి రవితేజ, లక్ష్మీ శ్రావ్య దంపతులు అందజేశారు.

ఎస్‌టియుకు అభినందనలు : ఎంపిపి

చింతలపూడి : 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎస్‌టియు ఎపి ఉపాధ్యాయుల సంఘానికి ఎంపిపి రాంబాబు అభినందనలు తెలిపారు. పట్టణంలో టీచర్స్ యూనియన్ ఎస్‌టియు ఎపి రాష్ట్ర కమిటి పిలుపు మేరకు 75 వసంతాల వజ్రోత్సవాల సంబరాల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల విద్యా శాఖాధికారులు రామారావు, మొక్కలు నాటారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

టి.నరసాపురం : గ్రామస్థాయిలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం అమలులో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మంగా కుమారి అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో డ్వామా పీడీ, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి సోషల్ ఆడిట్‌పై విచారణ నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 2022-23 సంవత్సరానికి ఖర్చు చేసిన రూ.9 కోట్ల 93 లక్షల నిధులుపై రూ.22 వేల 570 అక్రమాలు జరిగినట్లు గుర్తించామన్నారు. రికవరీ పెట్టినట్లు రూ.4 వేల ఐదువందల రికార్డు నిర్వహణలో అలసత్వంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఫైన్ విధించారు.

అంగన్వాడీల పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది

30వ రోజు సమ్మె శిబిరంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్వాడీల పోరాటం రాష్ట్ర ఉద్యమాల చరిత్రలో నిలిచిపోతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. చింతలపూడి పట్టణంలో ఫైర్ స్టేషన్ వద్ద అంగన్వాడీల సమ్మెకు రౌండ్ టేబుల్ సమావేశం పూర్తి మద్దతు తెలిపింది. రౌండ్ టేబుల్ సమావేశంలో టిడిపి, జనసేన, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్, లోక్ సత్తా, మెప్మా ఆర్‌పిలు, ఎస్‌ఐఏ సంఘాలు, ఉపాధ్యాయ సంఘం, మహిళా సంఘాలు, జనవిజ్ఞాన వేదిక నాయకులు హాజరై 30 రోజులుగా సాగుతున్న అంగన్వాడీల సమ్మెకు పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ సత్యనారాయణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజిని, హేమలత పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 30వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలు భిక్షాటన చేసి నిరసనలు తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీ సమ్మెను నీరు గార్చే ప్రయత్నం చేస్తోందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్న కుమారి, పి.పద్మజ, జె.నాగమణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీత రాయల్, బొబ్బిలి చిట్టి, ఎమ్.వెంకటలక్ష్మి, ఎమ్.మంగా పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 30వ రోజు అంగన్వాడీ కార్యకర్తలు వినూత్నంగా 30 అంకె ఆకారంలో రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించి ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్మా జిఓ నెంబర్ రెండు దగ్ధం చేశారు. ఇటువంటి జిఓలకు భయపడేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, లలిత, కృష్ణవేణి, పుష్ప, మరమ్మ, సుజాత, రామలక్ష్మి పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో భిక్షాటన చేస్తూ..

ముసునూరు: తమ జీతాలు చాలక, ఉద్యోగ భద్రత లేక నిరసనలు చేపడితే, ఈ రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని ఉద్యోగం నుంచే లేకుండా చేయాలని చూస్తుంది, మా తడాఖా ఏంటో చూపిస్తాం అంటూ నిరసన కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి, కలపాల విద్యావతి, మేరీ సులోచన, దుర్గ, శిరీష, అలివేలు, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

నిడమర్రు : ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఎస్మా చట్టం రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు అన్నారు. నిడమర్రులో అంగన్వాడీ వర్కర్ సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. తహశీల్దార్ సాయిరామ్, ఎంపిడిఒ విజయకుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొని సమ్మె విరమింపజేయాలని, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందక ఇబ్బంది పడుతున్నారని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, ఎన్.పార్వతి, ప్రేమలత, ఎ.నాగమణి, నాగేశ్వరి, సుభాషిని, ఉమా, వెంకటలక్ష్మి, త్రివేణి పాల్గొని మాట్లాడారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 30వ రోజుకు చేరింది. అంగన్వాడీలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీచేయడాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ సంఘం నాయకులు ఇక్కుర్తి మేరీ లక్ష్మి కోప్పినీడి రమాదేవి, విజయ లక్ష్మి, స్నేహ, సరోజ్, పుష్ప పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద నిరసన దీక్ష చేస్తున్న అంగన్వాడీల నిరసన దీక్ష బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.రాజు, రమాదేవి, పద్మజ్యోతి పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల నిరవధిక సమ్మె 30వ రోజు కొనసాగింది. బుధవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, ప్రమీలారాణి, శ్రీదేవి నాయకత్వం వహించారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక దీక్షలు బుధవారంతో 30వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం దారుణం అన్నారు.

ఆగిరిపల్లి : అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.అజరయ్య డిమాండ్ చేశారు. అంగన్వాడీల నిరవధికసమ్మె 30వ రోజులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 30 నెంబరు ఆకారంలో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రాజు, సిపిఎం నాయకులు ఎస్.కోటేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు జ్ఞానసుందరం, జీవరత్నం, వెంకటేశ్వరరావు, అనూరాధ, పుల్లమ్మలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడల పేరుతో గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజేయనాయుడు హెచ్చరించారు. చింతలపూడి పట్టణంలో పోలిస్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేకాట నిర్వాహులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు, వారిపై గట్టి నిఘా ఉంచడం జరుగుతుందని అన్నారు. జంగారెడ్డిగూడెం పరిధిలో 625 బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐ మల్లేశ్వరావు, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు

ఏలూరు : ఏలూరు డివిజన్‌లో కోడి పందేలు, జూదం, గుండాట మొదలైనవి ఆడుటపై నిషేధ ఆజ్ఞలు వున్నాయని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలి తెలిపారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు.

నూజివీడు రూరల్: నూజివీడు పోలీస్ డివిజన్ పరిధిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కోడి పందేల నిర్వాహకులు కోడి కత్తుల తయారీ దారులను బైండోవర్ చేసి వారిపై నిగా ఉంచటం జరిగిందన్నారు. ప్రజలు సాంప్రదాయబద్ధంగా పండుగను నిర్వహించుకోవాలని సూచించారు.

ముదినేపల్లి : మండల పరిధిలో ప్రజలు ఎక్కడైన అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ డి.వెంకటకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు.


జూద క్రీడల నివారణకు అవగాహన

ఆగిరిపల్లి: ఉన్నతాధికారుల ఆదేశానుసారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా కోడిపందేలు, పేకాట వంటి జూదాలును నివారించుటలో భాగంగా యువతకు జూద క్రీడలు వద్దు-సాంప్రదాయ క్రీడలు ముద్దు అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమంను ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'జన్ భాగీదారి' విజయవంతం చేయాలి : ఎంఎల్ఎ

భీమడోలు : అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి విజయవాడలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టిన జన్ భాగీదారి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మండలంలోని ఆగడాలలంక గ్రామంలో ఎంఎల్ఎ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.20 లక్షలతో నిర్మించిన మూడు అంతర్గత రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. ఇదే క్రమంలో గ్రామాన్ని ముంపు బారి నుంచి తప్పించేందుకు రూ.12 లక్షల ఉపాధి హామీ నిధులతో పూడిక తీసిన పంట కాలువ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కనమాల రామయ్య, గ్రామ సర్పంచి భలే రాంబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానం స్ఫూర్తిదాయకమని వైసిపి గుండుగొలను గ్రామ అధ్యక్షులు, గ్రామ ఉపసర్పంచి ముందుండి సూర్యనారాయణ రాజు అన్నారు. గ్రామంలో ప్రజా భాగస్వామ్యంతో జన్ భాగదారి కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ సర్పంచి కె.లక్ష్మి అధ్యక్షత వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ఉప సర్పంచి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానం, ఇతర విధానాలు అందరికీ ఆదర్శప్రాయం అన్నారు. రెవిన్యూ అధికారి శంకర్ రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామస్థాయి సచివాలయాల సమన్వయకర్త గొటికల మురళీ, సామాజిక కార్యకర్త టి.సుమన్ బాబు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాలులర్పిస్తున్న సూర్యనారాయణ రాజు

జీలుగుమిల్లి : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికుడని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దర్భగూడెం పంచాయతీలో పర్యటించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి ఎంపిటిసి కంచర్ల సుధారాణి మామగారైన కంచర్ల లక్ష్మీనారాయణ ఇటీవల గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సున్నం సురేష్, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవరెడ్డి, చౌదరిరెడ్డి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను అందరూ ఆచరించాలని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు అన్నారు. జన్‌భాగీదారిలో భాగంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మనమందరం ఆచరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయి సుధీర్ బాబు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పిఒ కృష్ణమూర్తి, కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గుర్నాథ్, విజయ్ కుమార్ జైన్, శ్యామ్యూల్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ఏలూరు టౌన్ : ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని బుధవారం నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి శంఖుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 40 డివిజన్‌లో రూ.57.61 లక్షల వ్యయంతో తొమ్మిది రోడ్లు, ఆరు డ్రైనేజీలు, 41 డివిజన్‌లో రూ.54 లక్షల వ్యయంతో ఐదు రోడ్లు, ఆరు డ్రైనేజీలు, ఒక కమ్యూనిటీ హాల్ ఆధునీకరణకు శంకుస్థాపన చేశారు. 42 డివిజన్‌లో రూ.90 లక్షల వ్యయంతో ఐదు రోడ్లు, నాలుగు డ్రైన్లు, ఐదు కల్వర్టులు, 43 డివిజన్‌లో రూ.87.23 లక్షల వ్యయంతో 10 రోడ్లు, 8 డ్రైనేజీలు వెరసి మొత్తం రూ.2.91 కోట్ల వ్యయంతో 29 రోడ్లు, 24 డ్రైనేజీలు, 6 కల్వర్టులు, ఒక సామాజిక భవన ఆధునీకరణకు శంకుస్థాపనలు చేశారు.

అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం ఆవిష్కరణ నేపథ్యంలో ఆళ్ళ నానిని ఎస్‌సి, ఎస్‌టి పెద్దలు ఏలూరు క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ బృహత్కార్యానికి సంబంధించి సన్నాహక కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు. అనంతరం మహా విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆ ప్రకటనలు నమ్మొద్దు : డాక్టర్ శ్యామ్ సుందర్

ఏలూరు టౌన్ : ప్రభుత్వ వైద్యులు సమ్మెకు దిగుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం పేరుతో వస్తున్న వార్తలు నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిడకల శ్యామ్ సుందర్ తెలిపారు. స్థానిక జాబిల్లి అతిథి గృహంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ పిడకల శ్యామ్ సుందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు సమ్మె చేయబోతున్నట్లు ఊరు పేరు లేని పుట్ట గొడుగులు లాంటి సంఘాలు చేస్తున్న ప్రకటనలు నమ్మొద్దన్నారు. సమ్మెకు దిగుతున్నట్టు డాక్టర్ జయధీర్ విడుదల చేసిన పత్రికా ప్రకటన నమ్మొద్దన్నారు. కోట్లాది నిరుపేదలకు ఆధారమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థను స్తంభింపజేసే దురాలోచనతో కుట్రపూరిత చర్యలకు దిగుతున్న డాక్టర్ జయధీర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.దుర్గా ప్రసాద్, డాక్టర్ ఎమ్.గులాబ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

నూజివీడు రూరల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్ష బుధవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని, రద్దు చేసే వరకు నిరసన దీక్ష ఆగదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు, రవి శంకర్, రమేష్, రామారావు, తదితర లాయర్లు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభ గుర్తింపునకే 'ఆడుదాం ఆంధ్రా'

భీమడోలు : క్రీడల పట్ల ఆసక్తి గల క్రీడాకారులు తమలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించేందుకు, గుర్తింపు పొందేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం దోహదపడుతుందని భీమడోలు మండల ప్రత్యేక అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి తెలిపారు. భీమడోలు హైస్కూల్ ఆవరణ వేదికగా ఆడదాం ఆంధ్రా నియోజకవర్గస్థాయి పోటీలకు మండల జట్టు సభ్యులుగా ఎంపిక అయ్యేందుకు ప్రత్యేకించిన క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయు. ప్రస్తుతం ప్రారంభమైన క్రికెట్ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. 13, 14, 15 తేదీల్లో సంక్రాంతి సందర్భంగా ఆటలకు సెలవు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి, తహశీల్దార్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, పోలవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి ముందుగా జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దేశంలోనే ఎన్నడూ లేనివిధంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి రమణ, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, జిసిసి స్టేట్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, ఎంపిటిసి తెల్లం రమణ పాల్గొన్నారు.

ముసునూరు: మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో మన మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్ కోరారు. బుధవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి కొండా దుర్గ భవాని వెంకట్రావు, ఎంపిడిఒ జి.రాణిల ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, కంచర్ల వాణి, ఎంఇఒ బి.సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆలీఖాన్, బి.సుకుమార్, వాకా నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని డిఎఆర్ కళాశాల ఆవరణలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ యువత క్రీడల్లో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.